సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



విద్యా కానుక సిద్ధం

పిల్లలకు ఇచ్చే ఆస్తి విద్యేఅని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటుంటారు.

- 8లో



'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ

గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం 'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు.

- 8లో



ముగిసిన పగడాలమ్మ జాతర

భక్తులు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఖ్యాతి గడించిన మండలంలోని జావాం గ్రామదేవత పగడాలమ్మ జాతర అత్యంత వైభవంగా ముగిసింది.

- 8లో

ఇఫ్తార్	సహర్
సోమ (సా.)	మంగళ (ఉ.)
6:16	4:20

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. అనాథులు, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు నెలకు రూ.4వేలు సాయం అందించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. 2019 కోవిడ్ సమయంలో తల్లిదండ్రులు చనిపోయి ఎంతో మంది పిల్లలు అభాగ్యులుగా, అనాథులుగా మారడంతో వారికి ఆర్థిక భరోసా స్పాన్సర్‌షిప్‌ను ప్రవేశపెట్టాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా జిల్లా బాలల రక్షణ విభాగం ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అనాథ పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

పంట పొలాల్లోకి ఏనుగులు



కోసలి - కీసర మధ్య జీడి తోటల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తాలాడ ఐలమ్మ తోట నుంచి నాలుగు ఏనుగుల గుంపు ఆదివారం బయటకు వచ్చి పంట పొలాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేశాయి. కీసర - కోసలి గ్రామాల మధ్య పంట పొలాలను ధ్వంసం చేశాయి. మొక్కజొన్న, కర్బూజా, చెరకు పంటలను తినేశాయి. దీంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

12న జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా కంపెనీ వారిచే ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. 18 నుంచి 26 సంవత్సరాల వయసు గల యువకులు మాత్రమే అర్హులన్నారు. ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ మెయింటెనెన్స్ జాబ్‌లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు డిప్లమో, మెకానికల్, బీఎస్సీ పాస్/ఫెయిల్, బీఫార్మ్ చదివి ఉండాలని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాబా ఉరుసు మహోత్సవం రేపు



హజరత్ గంజేసయ్యద్ బాబా దర్గా

విజయనగరం: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదుగా ఉన్న హజరత్ గంజేసయ్యద్ బాబా ఉరుసు మహోత్సవాన్ని ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు దర్గా అధ్యక్షుడు ఖాదర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుసు ఉత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఆ రోజు బాబాదర్గాలోని గుసుల్, ఫాతేహ, చందనం, సలామ్, మిలాద్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రంజాన్ ఇఫ్తార్ అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కార్యక్రమంలో ముస్లిం సోదరులంతా పాల్గొనాలని కోరారు.

ఏటీఎంల్లో నగదు నిల్

రాజాం : రాజాంలో 27కి పైగా ఏటీఎంలు ఉన్నాయి. ఇవన్నీ గడిచిన రెండు రోజులుగా నగదు లేక బోసిపోయాయి. వరుసగా బ్యాంకులకు మూడు రోజులు సెలవులు రావడంతో నగదు లావాదేవీలు స్తంభించాయి. ఈ క్రమంలో ఏటీఎంల్లో డబ్బులు నింపాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నగదు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. ఉద్యోగులు, వ్యాపారులు నగదు కోసం ఏటీఎంలను ఆశ్రయించి లేక నిరాశగా వెనుదిరిగారు.

మన్యంలో నవరత్న వికాసం

- క్యాలెండర్ ప్రకారం పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు మేలు
- అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యం
- నాడు–నేడు పథకం కింద 540 పాఠశాలలకు రూ.144.78 కోట్ల కేటాయింపు
- సర్కారు బడికి ఆధునిక సొబగులు
- ప్రతినెలా 1.40 లక్షల మందికి ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేత
- జిల్లాలో 24.743 మందికి సొంతింటి కళ సాకారం



విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న అధికారులు (ఫైల్)



కొమరాడ మండలంలో పూర్తయిన రోడ్డు నిర్మాణం

పార్వతీపురంటౌన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా బాగుపడిన వారు జన్మభూమి కమిటీ సభ్యులు మాత్రమే. చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తరువాత చెప్పేది ఒకటైతే చేసేది మరొకటి. వృద్ధులకు పింఛన్లు కావాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేది. పింఛన్ డబ్బులకు రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి. రైతులు, డ్వాక్రామహిళల రుణాలు కూడా మాఫీ చేయకుండా మోసం చేశారు. నాయకుల సిఫార్సులేనిదే ఇళ్లు మంజూరయ్యేవికావు. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతి పాలనకు తెరపడింది. నాలుగేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగుతోంది. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ఊరు/వార్డులోనే అందుతున్నాయి. వలంటీర్ల వ్యవస్థతో పథకాలు ఇంటివద్దకే చేరుతున్నాయి. ప్రతిఇంటా నవరత్న వికాసం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రగతి పరిమళాలు గుభాళిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓటువేయడం వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏటా కలిగే 'నవరత్న'వికాసాన్ని లబ్ధిదారులు గుర్తుచేసుకుంటున్నారు.

అభివృద్ధి మంత్రం

- జిల్లాలోని తాగునీటి సమస్యను అరికట్టేందుకు 2,959 తాగునీటి కుళాయి పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. తొలివిడతలో 42 వేల గృహాలకు తాగునీటిని అందిస్తోంది. దీనికోసం రూ.503 కోట్లను వెచ్చించింది.
- సొంతంటి కళను నెరవేర్చేందుకు జిల్లాలో 24,743 మందికి ఇళ్లపట్టాలు అందజేసింది. అందులో 9,226 మంది గృహప్రవేశాలు చేశారు. జిల్లాలోని సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గం పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ.61.04 కోట్లను ఖర్చుచేస్తోంది.
- జిల్లాలోని 312 గ్రామ సచివాలయాలు, 302 ఆర్‌బీకేలు, 197 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు, 29 బల్క్‌మిల్క్ యూనిట్లు, 85 డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి ప్రభుత్వం రూ.248.9 కోట్లు విడుదల చేసింది. ఇందులో 60 శాతం పనులు పూర్తయ్యాయి.

ప్రజారోగ్యానికి పెద్దపీట



పార్వతీపురంలో పూర్తయిన ఆస్పత్రి

- జిల్లాలోని 37 పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించింది. ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులు భర్తీ చేసింది.
- గిరిజన ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పార్వతీపురం, సీతంపేటలో రూ.50కోట్ల చొప్పున రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టింది.
- పార్వతీపురం జిల్లా కేంద్రంలో రూ.600 కోట్లతో బోధనాస్పత్రికి నిధులు కేటాయించింది. పనులు ప్రారంభం కావాల్సి ఉంది.
- పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో 100 పడకల నుంచి 150 పడకల సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.21.15 కోట్లను మంజూరుచేసింది.
- సాలూరు, కురుపాం, భద్రగిరి సీహెచ్‌సీలను 30 పడకల సంఖ్య పెంచుతూ రూ.28.95 కోట్ల నిధులను కేటాయించింది.

విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు...



నాడు-నేడు నిధులతో సర్వాంగ సుందరంగా ముస్తాబైన జియమ్మవలస పాఠశాల

- మనబడి నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2 అభివృద్ధి పనుల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 540 పాఠశాలల్లో 814 పనులను రూ.144.78 కోట్ల వ్యయంతో ప్రభుత్వం చేపట్టింది. సర్కారు బడులకు ఆధునిక సొబగులు అద్దుతోంది.
- జగనన్న గోరుముద్దను 1582 పాఠశాలల్లో అమలు చేస్తోంది. 71,280 మంది విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని సమకూర్చుతోంది.
- ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఏ విద్యార్థి విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది. 2021-22 విద్యాసంవత్సరానికి సంబంధించి 86,490 మంది తల్లుల ఖాతాల్లో నేరుగా రూ.129.61కోట్లను జమ చేసింది.
- జగన్న విద్యాకానుక పథకం కింద 97,474మంది విద్యార్థులకు జగనన్న విద్యాకిట్లను అందజేసేందుకు జిల్లాకు రూ.29.69 కోట్లను ఖర్చుచేసింది.
- కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆన్‌లైన్ కంటెంట్ కోసం జిల్లాలో 9,775 మంది విద్యార్థులు, 1878 మంది ఉపాధ్యాయులకు రూ.37.39 కోట్ల విలువైన ట్యాబ్‌లను సమకూర్చింది.

సంక్షేమ వికాసం



లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

- వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద మొత్తం 1,40,282 లబ్ధిదారులకు రూ.394.68 కోట్లను ప్రభుత్వం ప్రతినెలా ఒకటవ తేదీన వలంటీర్లతో ఇళ్లకు వెళ్లి అందజేస్తోంది.
- వైఎస్సార్ బీమా కింద ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 268 లబ్ధిదారుల కుటుంబాలకు రూ.2.73 కోట్లను అందజేసింది.
- వైఎస్సార్ చేయూత కింద మొత్తం 75,290 మంది లబ్ధిదారులకు రూ.141.16 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 6,595 మంది లబ్ధిదారులకు రూ.12.36 కోట్ల లబ్ధి చేకూర్చింది.
- బ్యాంకు లింకేజీ మొత్తం 7,766 స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.328.83 కోట్లు, గ్రామీణ, పట్టణాల్లో 1385 స్వయం సహాయక సంఘాలు రూ.97.20 కోట్ల మేర లబ్ధి పొందాయి.
- వైఎస్సార్ ఆసరా మూడో విడతలో మొత్తం 14,383 స్వయం సహాయక సంఘాలకు 94.19కోట్ల మేర లబ్ధి చేకూరింది.
- జగనన్న తోడు కింద మొత్తం 16,123 లబ్ధిదారులకు రూ.16.12 కోట్లు, పట్టణంలో 2160 మంది లబ్ధిదారులకు రూ.2.16 కోట్లతో ప్రయోజనం చేకూరింది.
- వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద 1514 మంది లబ్ధిదారులకు రూ. 2.27 కోట్లు, వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద 4,371 మంది ఆటోవాలాలకు రూ.4.37కోట్ల మేర ఆర్థిక లబ్ధి కలిగింది.

అన్నిరంగాల్లో అభివృద్ధే ధ్యేయం



పార్వతీపురం మన్యం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. జిల్లాలోని సహజ వనరులు సద్వినియోగమయ్యేలే పారిశ్రామిక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా నిరంతరం అధికారులతో సమీక్షిస్తున్నాం. ప్రజల సమస్యల పరిష్కారానికై మండల కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీలను స్వీకరిస్తున్నాం. పర్యాటక ప్రాంత అభివృద్ధిలో భాగంగా గిరిజన గ్రామాల్లో రీసార్ట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

పడిపోయిన జీడి ధర

ఏజెన్సీలో ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో జీడి పిక్కల నాణ్యత దెబ్బతింది. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది జీడి ధర తగ్గిపోయింది. వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతిన్న జీడి పిక్కలను దళారీలు క్యాష్ చేసుకుంటున్నారు.



నాణ్యత లోపించిన జీడి



దెబ్బతిన్న జీడి చెట్లు

- అకాల వర్షాలతో నాణ్యత లోపించిన జీడి పిక్కలు
- రోజుకో ధర నిర్ణయిస్తున్న ప్రైవేటు వ్యాపారులు
- కిలో రూ.100 లోపే..
- గతేడాది రూ.130కి పైగా అమ్మకాలు
- నష్టాలు చవిచూస్తున్న గిరిజనులు
- సుమారు 20 వేల ఎకరాల్లో జీడి సాగు
- ఏటా 14 వేల టన్నుల వరకు దిగుబడి

మండలాల వారీగా జీడి సాగు విస్తీర్ణం, దిగుబడి వివరాలు..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఉత్పత్తి (టన్నుల్లో)
సీతంపేట	6.119.51	4283.66
గుమ్మలక్ష్మీపురం	2,693.29	1885.30
జియ్యమ్మవలస	1493.95	1045.76
కురుపాం	3,644.76	2551.33
పార్వతీపురం	780	546
కొమరాడ	825.60	577.92
సీతానగరం	152.80	106.96
మక్కువ	596.80	417.76
బలిజిపేట	63.60	44.52
పాలకొండ	298.80	209.16
వీరఘట్టం	1266.80	886.76
గురుగుబిల్లి	31.20	21.84
భామిని	958	670.60
సాలూరు	1422.44	995.71
పాచిపెంట	160.19	112.13
మొత్తం	20,507	14,355

సీతంపేట: మునుపెన్నడు లేని విధంగా ఈ సంవత్సరం సీజన్ ఆరంభంలోనే జీడి పిక్కల ధరలు పడిపోయాయి. అకాల వర్షాలతో పంటలకు నష్టం ఏర్పడింది. పిందెలు, పిక్కలు చెట్లు నుంచి రాలిపోవడం, ఈదురు గాలులు, వడగండ్ల వర్షాలకు పిక్కల్లో నాణ్యత కాస్తా లోపించింది. ఇదే అదునుగా రోజుకో ధర చొప్పున నిర్ణయిస్తూ రూ.100 వరకు దళారీ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం రూ.130 వరకు పలికిన ధరలు ఆకస్మాత్తుగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా జీడిపిక్కల కొనుగోలులో దళారీ వ్యాపారుల హవా సాగుతుంది. ఐటీడీఏ పరంగా ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏవీ ఏర్పాటు చేయలేదు. వెలుగు ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన ప్రోసెసింగ్ కేంద్రాలు అధికారులు తగిన శ్రద్ధ కనబరచకపోవడంతో నత్తనడకన సాగుతున్నాయి. జీడి పండించే రైతులకు అన్ని విధాలుగా మార్కెటింగ్‌కు సహకరిస్తామని సంబంధిత అధికారులు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. గతంలో వోలం అనే ప్రైవేటు కంపెనీ ద్వారా గిరిజన రైతుల నుంచి జీడి కొనుగోలు చేసి మార్కెటింగ్‌లో చేదోడువాదోడుగా ఉంటామని చెప్పినా ఫలితం లేదు. ఈమేరకు జీడి రైతు సంఘాలను ఏర్పాటు చేసి వోలం సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. రైతుల వద్దకే నేరుగా వచ్చి జీడిని కొనుగోలు చేసుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నా ఇప్పుడు ఆ సంస్థ జాడలేదు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో టీపీఎంయూ మండలాల్లో 11 వేల మంది జీడి రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కూడా చేయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా జీడి పిక్కలు కొనుగోలులో మొండి చేయి చూపారు.

14వేల టన్నులకు పైగా దిగుబడి

జిల్లాలో దాదాపు 20,507 ఎకరాల్లో జీడి విస్తరించి ఉందని హార్టీకల్చర్ అధికారుల అంచనా. మొత్తం 14,355 టన్నుల దిగుబడి ఉంటుందని అంచనా. ఈ సంవత్సరం కొద్ది రోజుల కిందట కురిసిన ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలకు సగానికి పైగా దిగుబడి పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది వ్యాపారులు గ్రామాలకు నేరుగా వెళ్లి అక్కడ కొనుగోలు చేసుకుంటున్నారు. వారపు సంతల్లో సైతం దళారీలు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. పైగా జీడి పంటలు పండించడానికి రైతులు వ్యాపారుల నుంచి ముందుగా అడ్వాన్సులు తీసుకోవడంతో వ్యాపారులకే విక్రయించాల్సి వస్తుందని గిరిజనులు చెబుతున్నారు.

ప్రోసెసింగ్ కేంద్రాలకు జీడి పప్పు



జీడి ప్రోసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 7 ప్రోసెసింగ్ కేంద్రాలున్నాయి. 20 టన్నుల చొప్పున ఒక్కో కేంద్రం నుంచి వీడీవీకేల ద్వారా కొనుగోలు చేసి ప్రోసెస్ చేసి మార్కెట్లో జీడి పప్పును విక్రయించేందుకు చర్యలు తీసుకోనున్నాం.

– నారాయణరావు, ఏపీడీ, వెలుగు

దిగుబడి తగ్గింది



ఈ ఏడాది కూడా అనుకున్నంత పంట దిగుబడి లేకపోవడంతో ఆదాయం కూడా లేదు. అకాల వర్షాలకు నష్టపోయాం. జీడి పిక్కలు కూడా నాణ్యత లోపించడంతో వ్యాపారులు చెప్పిన ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. పంటలు పోయినందున ఐటీడీఏ పరంగా జీడి రైతులను ఆదుకోవాలి.

– ఎస్. అరుణ, టిటుకుపాయి సర్పంచ్

నిర్లక్ష్యం!

- నిబంధనలు గాలికి
- సగం మందికే లైసెన్సులు
- వాహన రికార్డుల్లేకుండానే రోడ్లపైకి

వాహనదారుల నిర్లక్ష్యం ప్రాణాలకే ముప్పు తెస్తుంది. పాటించాల్సిన నిబంధనలు పాటించకపోవడం.. మరోవైపు తల్లిదండ్రులు మైనర్లకు సైతం వాహనాలిచ్చి రోడ్లపైకి పంపడం తదితర కారణాల వల్ల ప్రాణాలే కోల్పోవలసి వస్తుంది. అయినా నిర్లక్ష్యం వీడడం లేదు.



పట్టణంలో తనిఖీలు చేస్తున్న రవాణా శాఖాధికారులు

జిల్లాలో వాహనాల వివరాలు

ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	8,286
నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	1,27,914
2013 నుండి లైసెన్సులు తీసుకున్నవారు	54,640
రవాణా శాఖ నమోదు చేసిన కేసులు	9,285 (ఒక ఏడాదిలో..)
వసూలైన అపరాధ రుసుము	రూ.4.34 కోట్లు

పార్వతీపురం టౌన్: వాహనదారుల నిర్లక్ష్యం వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. లైసెన్సులు లేకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వారిపై రవాణా శాఖాధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మార్పు తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా వాహనదారుల తీరు మారకపోగా మరింత నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. పోలీసు, రవాణా శాఖ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప లైసెన్సు తీసుకోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దామన్న ఆలోచన రావడం లేదు. వాహనాల కొనుగోలులో చూపించిన ఆసక్తి లైసెన్సు తీసుకోవడంలో చూపించడం లేదు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో ప్రతి ఒక్కరూ ద్విచక్ర, లైట్ మోటార్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. లైసెన్సు లేకుండా, నిబంధనలు పాటించకుండా వాహనాలను నడపడం వల్ల నిత్యం జిల్లాలో పలు ప్రమాదాలు చోటుచేసుకుని పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ఎక్కాలంటే లైసెన్సుతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అన్న ఆలోచనను విస్మరిస్తున్నారు. ప్రధానంగా లైసెన్సు లేకుండానే యువతతో పాటు మైనర్లు రోడ్లపై బైకులతో రయ్ రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ఈ నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకుని కన్నవారికి గుండెకోత మిగులుస్తూ భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికైనా లైసెన్సు లేని, నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ పేర్లతో

పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ పేర్లతో మైనర్లయిన పిల్లలకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులే స్వయంగా రోడ్లపైకి పంపుతున్నారు. ప్రధానంగా లైసెన్సు లేకుండా వాహనం నడిపితే ప్రమాదం జరిగినా కనీసం ఇన్సురెన్స్ కూడా రాదు. ఈ విషయం తెలిసినా వాహనదారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో వాహనాలున్న వారిలో సగం మందికి కూడా లైసెన్సు లేవు. అయితే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారిలో అధికంగా లైసెన్సు లేని వారినే రవాణా, పోలీసు శాఖల అధికారులు గుర్తించారు. ట్రాఫిక్ నిబంధనలు, లైసెన్సులపై ఏటా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఎల్ఆర్ మేళా, రహదారి భద్రతా వారోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్, మితి మీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, ఓవర్ లోడ్ తదితర వాటిపై జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

భారీ మూల్యం తప్పదు



మైనర్లకు వాహనాలు ఇచ్చి పట్టుబడితే తల్లిదండ్రులకు జైలుశిక్ష ఉంటుంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానాతో పాటు పది రోజుల జైలుశిక్ష అనుభవించాల్సి వుంటుంది. ప్రతీ రోజూ రెండు, మూడు ప్రాంతాల్లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.

– మల్లికార్జునరెడ్డి, జిల్లా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

టాటా ఏస్, బైక్ ఢీకొని వ్యక్తికి స్వల్ప గాయాలు



వేపాడ: వీలుపర్తి రహదారిలో ఢీకొన్న టాటా ఏస్, బైక్

వేపాడ: మండలంలోని వీలుపర్తి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల మిత్ర గాయాల పాలయ్యాడు. వేపాడ నుంచి వీలుపర్తి వైపు వెళ్తున్న టాటా ఏస్ ఎదురుగా వస్తున్న గోపాలమిత్ర కృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న కృష్ణకు గాయాల య్యాయి. ఈ మేరకు సమాచారం అందడంతో 108 పైలట్ ఎ.ప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వేపాడ పీహెచ్‌సీకి తర లించి ప్రథమచికిత్స అందజేశారు.

చిన్నారి మృతిపై దర్యాప్తు

గజపతినగరం: అల్లూరి సీతారామ రాజు జిల్లా గురుగుబిల్లి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన రెండు నెలల చిన్నారి మృతి చెందిన విషయంపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజపతినగరం ఎస్సై గంగరాజు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు నెలల చిన్నారి ఆర్.వర్ష ఆరోగ్యం క్షీణించడంతో వైద్యసేవల కోసం శనివారం సాయంత్రం ఆమె తల్లిదండ్రులు గజపతినగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి డాక్టర్ రిఫర్ చేశారు. దీంతో చిన్నారిని గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో తమ బిడ్డ మృతి చెందిందని బాధిత తల్లి కృష్ణవేణి ఆరోపించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

135కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి పట్టుబడిన కారు వద్ద పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని దొర్లపాలెం జంక్షన్ వద్ద ఓ కారులో ఉన్న 135 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ స్విఫ్ట్ డిజైర్ కారును గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలేసి పారిపోవడంతో అనుమానం వచ్చి కారు తెరిచి చూడగా 135కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ ఘటనపై ఏఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై చెప్పారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన బంగారయ్య

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామం సమీపంలో ఫ్లెవుడ్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన పూడి బంగారయ్య మామిడిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం పోతనాపల్లిలో గ్రామదేవత బండెమ్మతల్లి జాతరకు వచ్చి పసుపు కుంకుమలు సమర్పించి మనుమరాలి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి మామిడిపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎస్.కోట వైపు వస్తున్న క్వారీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనాస్థలిలోనే బంగారయ్య మృతి చెందాడు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

జగనన్న విద్యా కానుక సిద్ధం

- 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కిట్లు
- రూ.1,650 విలువగల విద్యా సామగ్రి పంపిణీ
- జిల్లాలో లబ్ధిపొందుతున్న విద్యార్థులు 1,04,396 మంది
- వరుసగా నాలుగవ విడత విద్యార్థులకు లబ్ధి



పాలకొండ రూరల్: పిల్లలకు ఇచ్చే ఆస్తి విద్యేఅని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటుంటారు. ఆ మాటను నిజం చేయాలనే అహర్నిశలు కృషిచేస్తున్నారు. పిల్లలకు విద్యాభ్యాసంలో అవరోధాలు కలగకుండా విద్యారంగం అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారు. అన్నివర్గాల పిల్లలు చదువుల కోసం ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు పడకుండా అనేక సంక్షేమ పథకాల ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు ఏటా కేటాయిస్తూ కార్పొరేట్ విద్యకు దీటుగా సర్కారు బడులను ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. నాడు–నేడు పేరిట ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంతో పాటు జగనన్న విద్యా కానుక పేరిట ఏటా ప్రత్యేక కిట్లు విద్యార్థులకు అందిస్తున్నారు. బడి బాట పట్టిన పిల్లలకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంతో పాటు రూ.1,650 విలువైన విద్యా సామగ్రిని ఉచితంగా అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా మూడేళ్ల పాటు ఈ కిట్లు అందించిన ప్రభుత్వం ఈ ఏడాది నాలుగో దఫా 'విద్యాకానుక' అందించేందుకు చర్యలు చేపట్టింది.

తల్లితండ్రులపై భారం పడకుండా..

పిల్లలను బడికి పంపితే చాలు మిగిలిన అన్ని విషయాలను ప్రభుత్వమే చూసుకుంటుంది. విద్యార్థుల తల్లిదండ్రులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా అవసరమైన చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు సర్కారు బడిలో చదివే పిల్లలకు విద్యాకానుక రూపంలో 9 రకాల వస్తువులతో కూడిన 'జగనన్న విద్యాకానుక' ప్రత్యేక కిట్లు అందజేస్తున్నారు. వాటిలో విద్యార్థి తరగతికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్, పిక్టోరియల్ డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, బూట్లు, బెల్ట్, స్కూల్ బ్యాగ్ అందిస్తున్నారు. 2022–23 ఏడాదిలో లక్షా 3వేల 883 మంది విద్యార్థులకు రూ.17కోట్ల14లక్షలకు పైబడి ప్రభుత్వం నిధులు వెవెచ్చించింది. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 1,579 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిద్వారా ఈ ఏడాది బోధన సాగిస్తున్న ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు లక్షా 4వేల 396 మంది విద్యార్థులు ఉన్నారని అధికారులు పేర్కొంటున్నారు. వారి కోసం రూ.17కోట 22లక్షల 53వేల పైచిలుకు నిధులు ఖర్చుచేసి 4వ విడత జగనన్న విద్యా కానుకలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

యూనిఫాంలో మార్పు

ఈ ఏడాది ప్రభుత్వం అందించే యూనిఫాం రంగుల్లో కొంతమేర మార్పులు చేయనున్నారని అధికారులు చెబుతున్నారు. గతంలో బాలురకు లైట్ స్కై కలర్ షర్ట్, థిక్ బ్లూ ఫ్యాంట్, బాలికలకు పింక్, బ్లూ కలయికతో కూడిన యూనిఫాం అందించారు. ఈ ఏడాది ప్లెయిన్‌గా ఉండే ఏకరూపదుస్తులను బాలురకు, బాలికలకు మాత్రం చెక్స్ కలిగిన యూనిఫాం ఇచ్చే అవకాశం ఉంది. అలాగే స్కూల్ బ్యాగ్ రంగులో కూడా స్వల్పంగా మార్పులు ఉండనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రాష్ట్ర ఒలింపిక్ సంఘంలో వేణుగోపాలరావుకు చోటు



వేణుగోపాలరావును అభినందిస్తున్న గురాన అయ్యలు తదితరులు

విజయనగరం: రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో విజయనగరానికి చెందిన సీహెచ్ వేణుగోపాలరావుకు చోటు దక్కింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్ వేణుగోపాలరావును చిత్తూరు జిల్లాలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గంతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికైన వేణుగోపాలరావుకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గం రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

16తో చెరకు క్రషింగ్ పూర్తి



మీడియాతో మాట్లాడుతున్న కర్మాగారం అధికారులు

రేగిడి:

మండలంలోని సంకిలి వద్ద గల ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఈ నెల 16వ తేదీతో చెరకు క్రషింగ్ నిలుపుదల చేస్తున్నామని కర్మాగారం సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశ్వరరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మిగిలి ఉన్న చెరకును రైతులు అనుమతి తీసుకుని గడువులోగా తరలించాలని సూచించారు. చెరకు పర్మిట్‌లు కావాలనుకునే రైతులు తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు. సకాలంలో చెరకు గానుగను విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన రైతులు, లారీ, ట్రాక్టర్, మినీట్రాక్టర్, మినీ లారీల డ్రైవర్లతో పాటు ఎడ్ల బండ్ల రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకూ 4.54 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి కాగా, మరో 23 వేల టన్నుల చెరకు గానుగ ఆడేందుకు లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకూ కర్మాగారానికి చెరకు పంపిన రైతులకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. కార్యక్రమంలో కేన్ డీజీఎం రమేష్‌రెడ్డి, కేన్ ఏజీఎం కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: సహజ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సభా కార్యక్రమంలో ఎన్‌కే .బాబు సంపాదకత్వంలో రచించిన 'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, గేయ రచయిత గంటేడ గౌరునాయుడు సభాధ్యక్షత వహించారు. పాదిలాపు శ్రీనివాస్, చింతాడ తిరుమలరావులు సమీక్ష చేశారు. పుస్తకాన్ని నవలా రచయిత, కథకులు అట్టాడ అప్పలనాయుడు ఆవిష్కరించారు. అదేవిధంగా కథా ముత్యాలు అనే పుస్తకాన్ని ప్రముఖ రచయిత నాలుగెస్సులరాజు ఆవిష్కరించారు. పాయల మురళీకృష్ణ పుస్తక సమీక్ష చేశారు. పుస్తక అనువాదం కేవీ శేషారావు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం

- 1270 పనులకు రూ.37.63 కోట్లు
- జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి రామచంద్రరావు



జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి రామచంద్రరావు

పనులు, నిధుల మంజూరు ఇలా..		
విభాగం	మొత్తం పనులు	మంజూరైన నిధులు రూ. కోట్లలో
సీసీ రోడ్లు	618	15.16
కాలువలు	358	8.48
తాగునీటి పనులు	175	4.87
కల్వర్టులు	52	1.09
విద్యుత్ పనులు	19	0.35
ఇతర పనులు	38	1.68

పార్వతీపురంటౌన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు గుర్తించిన పనులకు సంబంధించి తక్షణమే అప్‌లోడ్ చేస్తున్నామని జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ పనుల నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పనులను సంబంధిత శాఖాధికారులకు అందజేసి తక్షణమే ప్రారంభించేలా చర్యలు చేపట్టామన్నారు. 1385 పనులు ప్రతిపాదించగా అందులో 1270 పనులు మంజూరని తెలిపారు. ఇప్పటివరకు ప్రారంభించిన 1227 పనులకు రూ.37.63 కోట్లను మంజూరు చేశారన్నారు. మరో 43 అభివృద్ధి పనులు కొద్ది రోజుల్లో ప్రారంభించేందుకు పూర్తి చర్యలు చేపట్టామని వివరించారు.

గిరిజనుల తరఫున పోరాటం

- న్యాయవాది రేగు మహేశ్వరరావు



మాట్లాడుతున్న రేగు మహేశ్వరరావు

సాలూరు: బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, గిరిజనుల తరఫున పోరాటం చేస్తామని గిరిజన ఉద్యోగుల న్యాయసలహాదారు, న్యాయవాది రేగు మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసం టీడీపీ ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో నాడు తీర్మానించిందని గుర్తుచేశారు. రాజకీయపార్టీలు రాజకీయాల కోసం గిరిజనులకు అన్యాయం చేయడానికి చూస్తున్నాయని ఆరోపించారు.గతంలో చంద్రబాబు చేసిన తీర్మానం తప్పని టీడీపీలోని గిరిజన నాయకులు ఖండించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో బోయ వాల్మీకులను చంద్రబాబు, లోకేష్‌లు రెచ్చగొడుతున్నారని, మరోవైపు ఇక్కడ ఏడు నియోజకవర్గాల్లో గిరిజనులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. గిరిజనులకు అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. గిరిజనులకు అండగా నిలబడాలని రాష్ట్రపతి, కేంద్రానికి లేఖ రాస్తామని చెప్పారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టప్రకారం గిరిజనుల హక్కులను కాపాడడానికి కృషిచేస్తామని స్పష్టం చేశారు. పలువురు గిరిజనేతరులు తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు పొంది గిరిజనులుగా ఉద్యోగాలు, ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు.వారిపైనా న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి మా వద్ద ఉన్న ఆధారాలను ప్రజలకు చూపిస్తామన్నారు.దీనిపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

గ్రామదేవత సంబరాలు ప్రారంభం



మామిడిపల్లిలో నైవేద్యం తీసుకువెళ్తున్న భక్తులు

సాలూరు:

మండలంలో మామిడిపల్లి గ్రామదేవత పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు వచ్చే నెల పండుగ జరగనున్న నేపథ్యంలో ఆదివారం గల్లకలిపారు. ముంగారమ్మ, దేశమ్మ, వల్లమ్మ, కొత్తమ్మ, గజేంద్రుడులకు గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ఊరు కట్టారు. నైవేద్యాన్ని అమ్మవార్లకు భక్తులు సమర్పించారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

కొట్లాటలో గాయపడిన వ్యక్తి మృతి

- న్యాయం కోసం గ్రామస్తుల బైఠాయింపు
- పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత



శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో మరణించిన చంద్రరావు



పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన గ్రామస్తులు, బాధిత కుటుంబీకులు

పాలకొండ రూరల్: ఇద్దరి యువకుల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీయగా ఈ ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై బాధితులు, ఆప్రాంత వాసులు, పోలీసులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పాలకొండ నగరపంచాయతీ పరిధి 3వ వార్డు ఎన్‌కె.రాజపురం ప్రాంతానికి చెందిన యువకులు ముడిదాన మోహనరావు, చందక శివశంకర్ శుక్రవారం రాత్రి తమ నివాసాలకు సమీపంలో గల చెరువు వద్ద చేరుకున్నారు. అక్కడ వారి మధ్య వాగ్వాదం జరిగింది. కొంత సమయం తరువాత మోహన్‌రావు ఇంటికి శివశంకర్ చేరుకుని గొడవపడ్డాడు. ఈ క్రమంలో మరోసారి వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఆ సమయంలో అడ్డుపడిన మోహన్‌రావు తండ్రి చంద్రరావు(52) శివశంకర్ చేసిన దాడిలో తీవ్రగాయాలపాలయ్యాడు. ఆయనను తొలుత పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఆయన పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఈఘటనపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసును పక్కదోవ పట్టిస్తున్నారన్న ప్రచారం ఊపందుకోవడంతో బాధిత కుటుంబీకులు, 3వ వార్డు ప్రజలు ఒక్కటై న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. చంద్రరావు మరణానికి కారణమైనవారిపై కేసు నమోదు చేయాలని, బాధ్యులను అదుపులోకి తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నినదిస్తూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బైఠాయించారు.

పాలకొండ- శ్రీకాకుళం రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్‌కే రాజపురం గ్రామస్తులు బైఠాయించడంతో పాలకొండ- శ్రీకాకుళం రహదారిలో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవీ.కృష్ణారావు స్టేషన్‌కు వచ్చి బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకుని చట్టపరమైన చర్యల తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధ్యుడిని అదుపులోకి తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని ఎస్సై బి.శివప్రసాద్‌కు, తక్షణమే దర్యాప్తు జరపాలని సీఐ మురళీధర్‌కు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో బాధితులు, గ్రామస్తులు శాంతించి వెనుదిరిగారు.

ముగిసిన పగడాలమ్మ జాతర



ఆలయం వద్ద క్యూలో భక్తులు



ఆలయ ఆవరణలో విద్యుత్‌దీపాలంకరణ

సంతకవిటి: భక్తులు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఖ్యాతి గడించిన మండలంలోని జావాం గ్రామదేవత పగడాలమ్మ జాతర అత్యంత వైభవంగా ముగిసింది. ఈనెల 7 నుంచి 9 వరకు మూడురోజుల పాటు ఆలయ కమిటీ జాతరను నిర్వహించింది. 24వ ఆలయ వార్షిక జాతరను ఈ ఏడాది పెద్ద ఎత్తున వినోద సాంస్కృతిక కార్యక్రమాల మధ్య నిర్వహించారు. ఆదివారం చివరి రోజు కావడంతో జావాం పరిసర గ్రామాల భక్తులతో పాటు శ్రీకాకుళం, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు జాతరకు వచ్చారు. పగడాలమ్మకు ముర్రాటలతో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కిలోమీటరు మేర క్యూ భక్తులతో నిండిపోయింది. కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వాటర్ ప్యాకెట్లు వంటివి పంపిణీచేసి దాహార్తిని తీర్చారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం బాణసంచా కార్యక్రమాలు మధ్య జాతర ముగిసింది. రాత్రి 9 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని రాష్ట్ర కళాకారులతో ఏర్పాటు చేశారు. పంచాయతీ సర్పంచ్ బోనెల ప్రసాద్, మాజీ సర్పంచ్ రామకృష్ణంనాయుడుతో పాటు గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు బారీ ఎత్తున మౌలికవసతులు యాత్రికులకు కల్పించారు. రాజాం రూరల్ సీఐ సీహెచ్. ఉపేంద్ర, సంతకవిటి, రేగిడి ఎస్సైలు ఆర్.జనార్దనరావు, శ్రీనివాసరావు తదితరులు జాతరను పోలీస్ బందోబస్తుతో పర్యవేక్షించి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.